సచివాలయ కార్యదర్శులకు..
యోగా కష్టాలు

- వెట్టి చాకిరీ చేయిస్తున్న ప్రభుత్వం
- అర్థం లేని ఓటీపీలతో ఇక్కట్లు
- కొత్తగా యోగా డే యాప్‌తో మరింత భారం



యోగా డే యాప్‌లో 'నో' పెట్టినా ఓటీపీ అడుగుతున్న వైనం


50వ వార్డులో సిబ్బంది బయటికి వెళ్లడంతో ఖాళీగా ఉన్న సచివాలయం

మర్రిపాలెం: వచ్చే నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నగరంలో జరగనున్న సందర్భంగా ఆ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ వస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయమై కూటమి ప్రభుత్వం హడావుడి అంతా ఇంతా కాదని, ప్రతి దానికి సర్వేల పేరుతో ఇటు సచివాలయ సిబ్బందిని, అటు ప్రజలను ఏదో రకంగా ఇబ్బంది పెడుతున్నారని జీవీఎంసీ 49,50,51,53 వార్డుల్లో పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు. నిజంగా చెప్పాలంటే సచివాలయ కార్యదర్శులను తెగ వాడేస్తున్నారనడానికి ఏ మాత్రం సందేహం లేదనే అంటున్నారు. ఇంతవరకూ రకరకాల సర్వేల పేరుతో ఇంటింటికీ తిప్పిస్తూ వలంటీర్ల యాప్‌లు కూడా కార్యదర్శులకే పరిమితం చేశారు. ఇవన్నీ చాలదన్నట్టు ఇప్పుడు యోగా యాప్ అంటూ ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలట. పోనీ చేద్దామంటే ప్రతి ఒక్కరి వివరాలు తీసుకుని యాప్‌లో పొందుపరచాలి. అదెలా అంటే ఒక కార్యదర్శి వారి వారి పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి యోగా యాప్ చూపించి వారు వస్తారో లేదో తెలుసుకుని యాప్‌లో నమోదు చేయాలి. వెళ్లడానికి సదరు వ్యక్తి ఆసక్తి చూపిస్తే వారి ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. అది అందులో పొందుపరిచి సబ్మిట్ చేయాలి. అంతవరకు ఓకే. కానీ వారు మేము రాము మాకు రావడానికి ఆసక్తి లేదు అంటే మామూలుగా అయితే వదిలేస్తారు. కానీ రారు అని చెప్పినా యాప్‌లో వివరాలు పొందుపరచి నో ఆప్షన్ పెట్టి మొబైల్ నంబర్ అడుగుతుంది. తద్వారా ఓటీపీ వస్తే అది వారికి చెప్పాలి. ఇది బుధవారం మధ్యాహ్నం వరకు ఉన్న తతంగం.

ఫేషియల్ రికగ్నిషన్, బయోమెట్రిక్‌తో తంటా..

ఇప్పుడు కొత్తగా నో ఆప్షన్ పెట్టి చెప్పిన కుటుంబ సభ్యుల్లో ఒకరిది ఫేషియల్ రికగ్నిషన్ లేదా బయోమెట్రిక్ ఇచ్చి అప్పుడు అది సబ్మిట్ చేయాలి. ఇలా రాని దాని కోసం ఓటీపీ అడిగి, ఫేస్ ఫొటోలు తీసి, బయోమెట్రిక్ కావాలని అడుగుతుంటే ప్రజలు ఎదురు తిరిగి ఇవన్నీ ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తూ విసుక్కుంటున్నారు. వెళ్లడానికి ఆసక్తి లేదని నిరాకరించినా ఇవన్నీ దేనికని కార్యదర్శులను నిలదీస్తున్నారు. దీంతో ఏం చేయాలో తెలియని అయోమయ పరిస్థితిలో సదరు కార్యదర్శులు ఉన్నారు. అసలే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని పత్రికలు, సోషల్ మీడియాల్లో వార్తలు వస్తున్నాయని, ప్రభుత్వం, అధికారులు, పోలీసులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్న తరుణంలో ఓటీపీలు అడగడమేంటని, ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో తెలియట్లేదని ప్రజలు అంటున్నారు.


రైస్ కార్డ్ కోసం సంబంధిత కార్యదర్శి కోసం వేచి చూస్తున్న ప్రజలు

యాప్‌లో వేల మంది నమోదు సాధ్యమేనా?

వార్డులో కనీసం ఐదు నుండి ఆరు సచివాలయాలు ఉన్నాయి. ఒక్కొక్క సచివాలయానికి ఆరు వందల చొప్పున వార్డులో అన్ని సచివాయాల పరిధిలో కనీసం వార్డుకు 3500 మందిని యోగా యాప్‌లో పాల్గొంటున్నదీ లేనిదీ దరఖాస్తు చేయాలంటే ఎన్ని గంటలు పని చేస్తే జరుగుతుంది. అన్నీ బాగుండి సర్వర్ మొరాయించకపోతే ఒక్కొక్క వ్యక్తి దగ్గర కనీసం 15 నిమిషాల నుంచి 30 నిమిషాలు పడుతుంది దరఖాస్తు చేయడానికి. దీంతో కార్యదర్శులు కూడా విసుగు చెందుతున్నారు.

మిగతా సేవల మాటేంటి?

ఇదిలా ఉండగా ప్రస్తుతం రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేవారు, సీనియర్ సిటిజన్ కార్డుల కోసం సచివాలయాలకు వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. అంతే కాక ఈ–కేవైసీ ప్రక్రియ కూడా తప్పనిసరయింది. దీంతో సచివాలయాలు కిటకిటలాడుతున్నాయి. సర్వేల పేరుతో పలువురు కార్యదర్శులు బయటికి వెళ్తుంటే అక్కడ పనులు చేసేందుకు ఎవరూ అందుబాటులో ఉండకపోవడంతో వచ్చిన వారు పడిగాపులు కాస్తున్నారు. ఇక టౌన్ ప్లానింగ్ సంగతి చెప్పనక్కర్లేదు. ఆఫీసుకు రావడం కొంతసేపు ఉండడం, ఎప్పుడూ పై అధికారులతో మీటింగులు లేదా కొత్తగా నిర్మిస్తున్న బిల్డింగుల వద్దకు వెళ్తుండడంతో వారి సీట్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఇదంతా ఒక ఎత్తయితే ఇదంతా చాలదన్నట్టు మరో పక్క సర్వర్ ఎప్పుడు పని చేస్తుందో ఎప్పుడు పని చేయదో తెలియని స్థితి. సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిరుగార్చి అస్తవ్యస్తం చేస్తుందని, సరిగ్గా ఉపయోగించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో అటు ఉద్యోగులు ఇటు ప్రజలు ఎవరూ సంతృప్తిగా లేరని విమర్శలు గుప్పుమంటున్నాయి.


50వ వార్డు బృందావన్ పార్కు వుడా కాలనీ సచివాలయం

ఉమానీలకంఠేశ్వరాలయ హుండీ ఆదాయం రూ.15.4 లక్షలు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో బుధవారం హుండీ ఆదాయం లెక్కించారు. 70 రోజులకు గాను రూ.15,40,000 ఆదాయం వచ్చినట్లు ఈవో బందారు ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో అర్చకుడు మహేష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం


పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మురళీనగర్: ఏజ్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీరియాటిక్ మెడికల్ కేర్‌లో భాగంగా బుధవారం పట్టాభిరెడ్డి తోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సూర్యతేజ పాల్గొని వృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులతో పాటు మురళీనగర్ పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు. వీరికి బీపీ, సుగర్, ఇతర సాధారణ వైద్య పరీక్షలు చేశారు. వృద్ధాశ్రమ నిర్వాహకుడు ఆర్.శ్రీనివాస్‌శిబిరం నిర్వహణకు సహకరించారు.

క్లుప్తంగా

ఒకేసారి వికసించిన నాలుగు మే ఫ్లవర్స్


మురళీనగర్‌లో కనువిందు చేస్తున్న మే పుష్పాలు

సీతంపేట: మురళీనగర్‌లో నివసిస్తున్న అరుణ కుమారి అనే మహిళ ఇంటి మేడపై పెంచుతున్న మొక్కల్లో ఒకేసారి నాలుగు మే ఫ్లవర్స్ వికసించి కనువిందు చేశాయి. పదేళ్ల కిందట నర్సరీ నుంచి తెచ్చిన మొక్కలను దుంప కుండీలో నాటినట్టు ఆమె తెలిపారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా మే పుష్పాలు వికసిస్తున్నాయని, ఈ ఏడాది ఒకేసారి నాలుగు ఫ్లవర్స్ వికసించి ఆకర్షిస్తున్నాయని చెప్పారు. వీటిని చూడటానికి చుట్టుపక్కల వారు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు.

కల్యాణ వేంకటేశ్వరుడికి విశేష సేవలు

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జేష్ఠ మాసం నుంచి ప్రతి శనివారం ఉదయం 5 గంటలకు సుప్రభాతం, తోమాల సేవ, శ్రీవారి అలంకరణ, అర్చన, సర్వదర్శనం వంటి విశేష సేవలు ప్రారంభిస్తున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. సాయంత్రం 5 గంటలకు స్వామి వారికి అర్చన, విష్ణు సహస్రనామ పారాయణ, నక్షత్ర హారతి, గోవింద నామాలు, ప్రసాద వితరణ జరుగుతాయని, రాత్రి 8.15 గంటలకు భోగ శ్రీనివాస మూర్తికి క్షీర నివేదన, హారతి, పవళింపు సేవ చేస్తామని చెప్పారు. పవళింపు సేవలో దంపతులను అనుమతిస్తామని, విశేష సేవల్లో పాల్గొనదలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

పెన్సిల్ చిత్రాల ప్రదర్శన


పౌర గ్రంథాలయంలో ప్రదర్శనలో ఉంచిన పెన్సిల్ చిత్రాలు

సీతంపేట: ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాల్లో భాగంగా నటరత్న సంస్థ ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నగరానికి చెందిన చిత్రకారుడు పి.రాజేశ్వరరావు గీసిన ఎన్టీఆర్ వివిధ పెన్సిల్ చిత్రాలను ప్రదర్శించారు. సుమారు 150కి పైగా చిత్రాలు ప్రదర్శనలో ఉంచారు. పలువురు ఎన్టీఆర్ అభిమానులు, కళాకారులు ప్రదర్శన తిలకించి చిత్రకారుడు రాజేశ్వరరావును అభినందించారు.

క్రీడా దుస్తుల పంపిణీ


క్రీడా దుస్తులు అందజేస్తున్న ఆచార్య షారోన్ రాజ్

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ విద్యా విభాగంలో బుధవారం మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య షారోన్ రాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధికి ఎన్టీఆర్ చేసిన కృషిని వివరించారు. ఏయూలో ఫుట్‌బాల్ క్రీడలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ఆయన క్రీడా దుస్తులను బహూకరించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, పోషకాహారాన్ని వితరణ చేశారు. డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము, పరిశోధకులు పాల్గొన్నారు.

◆ ఏయూలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ఎన్టీఆర్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఏయూ రెక్టర్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, దూరవిద్య సంచాలకులు ఆచార్య ఎస్.విజయమోహన్, ఆచార్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రశాంతి పార్కు నూతన కమిటీ ఎంపిక


కొలువుదీరిన నూతన కమిటీ

మురళీనగర్: స్థానిక ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కు నూతన కార్యవర్గం బుధవారం కొలువుదీరింది. పార్కులోని వివేకానందుడి సన్నిధిలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షుడిగా జి.వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడిగా రొంగలి జగన్నాథం, ఉపాధ్యక్షులుగా ఉప్పలపాటి శుభ, ఆర్.భాస్కరరావు, కార్యదర్శిగా రఘురాం పండా, సంయుక్త కార్యదర్శిగా జి.సునీత, ఎ.సురేష్, కె.శ్యాం, కోశాధికారిగా కె.బిందురాణి, సంయుక్త కోశాధికారిగా జె.శ్రీవాణి, జి.విజయకుమార్, సలహా మండలి సభ్యులుగా జీవీ రత్నం, కేసీహెచ్ నాయుడు, ఎంఆర్‌కే రంగారవు, పి.నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా జె.జనార్దనరావు, కె.లక్ష్మీనారాయణ, టి.ఆనందరావు, డి.మోహనరావు, డాక్టర్ కేసీహెచ్ శ్రీధర్, జగదీష్ ప్రజాపతి, జీవీ రాంబాబు, జె.సౌజన్య ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ కె.ద్వారకానాథ్, న్యాయవాది జె.పృథ్వీరాజ్, వైశాఖి స్పోర్ట్సు పార్కు కార్యదర్శి పీవీఎస్ రాజు, వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి, పూర్వ అధ్యక్షురాలు ప్రభాశర్మ, మా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కె.బాలచెన్నయ్య, వనమాలి, అడ్మిన్ ఎం.సరిత తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీ సిబ్బందిపై డీఎంహెచ్‌వో ఆగ్రహం


నరసింహనగర్ యూపీహెచ్‌సీలో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: నరసింహనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు బుధవారం సందర్శించారు. ఈ ఆరోగ్య కేంద్రం పలు కార్యక్రమాల అమలులో వెనుకంజలో ఉండడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అభ ఐడి నమోదు, ఎన్‌సీడీసీడీ సర్వే, వ్యాధి నిరోధక టీకాల అమలు వేగవంతం కావాలన్నారు. ఈ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం తగదన్నారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ప్రణాళికాబద్ధంగా జరగాలని, నిర్దేశించిన సూచనల ప్రకారం వ్యాక్సిన్ తెచ్చుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా ఓపీ, ల్యాబ్ టెస్టులు, సాధారణ ప్రసవాల గురించి వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆశ కార్యకర్తలు తమ ఏఎన్‌ఎంలతో కలిసి గర్భిణులకు టీటీ, ఐరన్ ఫోలిక్ మాత్రలు అందేటట్లు, ఎనీమియా బారిన పడకుండా చూడాలని అన్నారు. ఈ సందర్భనలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ లూసీ, నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, డీపీఎంవో, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి


రైల్వే న్యూకాలనీ సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సంఘ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. సీతమ్మధారలోని ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో ఎన్టీఆర్ చిత్రపటానికి సంస్థ డైరెక్టర్లు డి.చంద్రం, టి.వనజ, టి.వి.సూర్యప్రకాశ్ నివాళులర్పించారు. చీఫ్ జనరల్ మేనేజర్లు బి.రామచంద్రప్రసాద్, డి.సుమన్ కల్యాణి, జె.శ్రీనివాసరావు, బి.అశోక్‌కుమార్, పి.శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

◆ రైల్వే న్యూకాలనీ ఎన్టీఆర్ సర్కిల్‌లోని ఎన్.టి.రామారావు విగ్రహం వద్ద ఎన్టీఆర్ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో నాయకులు, అభిమానులు నివాళులర్పించారు. సంఘ అధ్యక్షుడు దువ్వి కాశీప్రసాద్, టీడీపీ 42వ వార్డు అధ్యక్షుడు కన్నం వెంకటరమణారావు, ముప్పాళ్ల శ్రీకృష్ణ, జనపాల కృష్ణ, కుప్పిలి కుంతీదేవి, గట్టు సీత పాల్గొన్నారు.

◆ సీతమ్మధారలోని బీజేపీ ఉత్తర కార్యాలయంలో కూటమి పార్టీల శ్రేణులు శ్యామలదీపిక, అరుణ్‌బాబు, దుర్గారావు, అనిల్‌కుమార్, అరుణ, రాజారావు, సత్యనారాయణ, భీమా నారాయణరావు, గిరీష్ ఎన్టీఆర్‌కు నివాళుల్పించారు.

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎనీటార్ చిత్రపటానికి కాలేజీ సిబ్బంది, విద్యార్థులు నివాళులర్పించారు.

వైభవంగా వేంకటేశ్వరాలయ వార్షికోత్సవం

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెం రామాలయంలో కొలువైన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం బుధవారం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 7.30 గంటలకు అర్చన సేవ, విశ్వక్సేన పూజ, భగవత్ పుణ్యాహవాచనం, పరిషత్ విజ్ఞాపన, రక్షా సూత్రధారణ, మండపారాధన, అష్టోత్తర శత కలశారాధన, స్వామివారికి అష్టోత్తర శత కలశాభిషేకం చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

ఎంవీపీ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం


విద్యార్థులతో ధ్యానం చేయిస్తున్న లక్ష్మి

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని ప్రభుత్వ నగర శాఖ గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమగ్ర శిక్ష అభియాన్ అకడమిక్ ఆఫీసర్ డాక్టర్ జి.లక్ష్మి విద్యార్థులచే ధ్యానం, యోగాసనాలు చేయించారు. జూన్ 21న యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ప్రతి రోజూ గ్రంథాలయంలో యోగాసనాలు శిక్షణ అందించాలన్నారు. గ్రంథాలయాధికారి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

18.5 కిలోల గంజాయి స్వాధీనం

- ఎక్సైజ్ అధికారుల అదుపులో ఇద్దరు నిందితులు

తాటిచెట్లపాలెం: తెలంగాణకు అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తులను జ్ఞానాపురం రైల్వే స్టేషన్ సమీపంలో ఎక్సైజ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారు తెలిపిన వివరాలివి.. విశాఖ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ టీం రవికిరణ్, ముసలనాయుడు, సీతమ్మధార ఎక్సైజ్ సీఐ నాగవేణి, సిబ్బంది సంయుక్తంగా బుధవారం జరిపిన దాడుల్లో ఒడిశా నుంచి హైదరాబాద్‌కు రైలు మార్గంలో గంజాయి తరలించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఒడిశా రాయగడకు చెందిన జిబాన్ జోతిపానీ, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ప్రిన్స్ వికాస్ బోర్డేస్‌లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 18.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

ఐపీఆర్ పీజీ డిప్లొమా విద్యార్థులకు అభినందన


కోర్సు పూర్తి చేసిన విద్యార్థులతో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం డీపీ ఐఐటీ–ఐపీఆర్ చైర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీ డిప్లొమో ఇన్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ కోర్స్ విజయవంతంగా పూర్తయింది. ఈ సందర్భంగా కోర్సు పూర్తి చేసిన విద్యార్థులను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. ఏడాది కాల వ్యవధి కలిగిన ఈ కోర్సులో పలువురు వైద్యులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఇంజినీర్లు, ఉన్నత విద్యావంతులు చేరి విజయవంతంగా పూర్తి చేయడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

మద్యానికి డబ్బులివ్వలేదని అమ్మమ్మపై దాడి

ఎంవీపీకాలనీ: అప్పుఘర్‌కు చెందిన కొండా మర్రమ్మకు ఇద్దరు కుమార్తెలు.. ఒక కుమార్తె కొడుకైన మహేష్ మద్యానికి బానిసయ్యాడు. రోజూ మద్యం కోసం కుటుంబ సభ్యులను వేధిస్తున్నాడు. ఇటీవల అమ్మమ్మ మర్రమ్మను మద్యం తాగడానికి డబ్బులు అడిగాడు. ఆమె దగ్గర లేవని చెప్పడంతో అప్పటికే మద్యం తాగి ఉన్న మహేష్ స్టీల్ జగ్‌తో ఆమెపై దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలు కాగా కేజీహెచ్‌లో మర్రమ్మ చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూలో ధోల్ డే సందడి


ఆసియాటిక్ వైల్డ్ డాగ్ చిత్రం వేస్తున్న చిన్నారి

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో బుధవారం ప్రపంచ ధోల్ డే (ఆసియాటిక్ వైల్డ్ డాగ్స్ డే) నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిత్రలేఖనం పోటీల్లో నగరంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆసియాటిక్ వైల్డ్ డాగ్స్ చిత్రాలతో అలరించారు. జూ క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ ఆసియా ఖండంలోని అడవి కుక్కల జాతినే ధోల్‌గా పిలుస్తారని తెలిపారు. ధోల్ ప్రపంచంలో ధోల్ ప్రాణులు అంతరించిపోతున్నాయన్నారు. దీని బ్రీడింగ్ సెంటర్‌ను విశాఖ జూలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ డాగ్స్‌పై అవగాహన కల్పించడానికి పిల్లలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. జూలో ప్రస్తుతం 47 ఆసియాటిక్ వైల్డ్ డాగ్స్ ఉన్నాయని, వాటిలో 28 మగవి కాగా.. 19 ఆడవి అన్నారు.

సాహితీవేత్తలకు ప్రతిభా పురస్కారాల ప్రదానం


డి.వి.సూర్యారావును పురస్కారంతో సత్కరిస్తున్న అతిథులు

సీతంపేట: నవసాహితి ఇంటర్నేషనల్, బొంబాయి తెలుగు సాహిత్య సమితి సంయుక్త నిర్వహణలో విశిష్ట ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ఆంధ్ర విశ్వకళా పరిషత్ తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో నవసాహితి ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఎస్.వి.సూర్యప్రకాశరావు తమ సంస్థ కార్యకలాపాల గురించి వివరించారు. ఈ సందర్భంగా గురజాడ కవితా పురస్కారాన్ని కవి కె.జి.వేణుకు, విశిష్ట సాహితీ పురస్కారాలను సాహితీవేత్తలు డాక్టర్ డి.వి.సూర్యారావు, ఆచార్య వెలమల సిమ్మన్నకు ప్రదానం చేసి సత్కరించారు. జర్రా అప్పారావు మాట్లాడుతూ సాహిత్యానికి సామాజిక ప్రయోజనం ఉందని, ఆ దిశగా ఉత్తమ సాహిత్య స్రష్టలను సత్కరించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో బొంబాయి తెలుగు సాహిత్య సమితి అధ్యక్షుడు రుద్రాభట్ల శ్రీరాంకుమార్, సాహితీవేత్తలు పిళ్లా రమణమూర్తి, కె.వి.ఎస్.మూర్తి, స్వాతి సోమనాథ్ పాల్గొన్నారు.

గృహ విద్యుత్ వినియోగదారులకు అదనపు లోడ్ రాయితీ

తాటిచెట్లపాలెం: ఏపీఈపీడీసీఎల్ గృహ విద్యుత్ వినియోగదారులకు అదనపు లోడ్ రాయితీ ఇస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.జ్యోతి, అసిస్టెంట్ ఇంజినీర్ జి.గోపినాథ్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సీతమ్మధార పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని వారు కోరారు. 'ప్రస్తుతం పాత పద్ధతి ప్రకారం వినియోగదారులు విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. దీని ప్రకారం గతంలో కేవలం లైట్లు, ఫ్యాన్లు, ఫ్రిడ్జ్‌లకు మాత్రమే గృహ వినియోగదారులకు అవకాశం ఉంటుంది. ప్రస్తుత కాలంలో ప్రతి ఇంట్లోనూ లైట్లు, ఫ్యాన్లతోపాటు మిక్సీలు, మోటార్లు, ఏసీలు సర్వసాధారణం. దీని వల్ల ప్రతి ట్రాన్స్‌ఫార్మర్‌పై అదనపు లోడ్ పడుతుంది. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడతాయి. వీటిని తగ్గించేందుకు గృహ విద్యుత్ వినియోగదారులు తమ లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవలసి ఉంటుంది. దీని వల్ల అవసరమైన చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు వేసేందుకు వీలవుతుంది' అని ప్రకటనలో విద్యుత్ శాఖాధికారులు తెలిపారు. అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించు కోలేకపోతే తనిఖీల సమయంలో లోడ్ చార్జీలతోపాటు జరిమానాలు చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు.

లోడ్ క్రమబద్ధీకరణ వల్ల లాభాలు

ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక భారం పడదు. హై వోల్టేజీతో గృహోపకరణాలకు నష్టం కలుగదు. నాణ్యమైన విద్యుత్ సరఫరాతోపాటు దానిలో హెచ్చు తగ్గులు ఉండవు.

50 శాతం రాయితీ..

జూన్ 30 లోపు అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకున్నట్లయితే వినియోగదారులకు 50 శాతం రాయితీని అందజేస్తామని అధికారులు తెలిపారు. 1 కిలో వాట్‌కు ప్రస్తుత చార్జీలు రూ.2,250 కాగా.. రూ.1250, 2 కిలో వాట్స్‌కు ప్రస్తుతం రూ.4.450కు గాను రూ.2,450, 3 కిలో వాట్స్‌కు ప్రస్తుతం రూ.6,650కు గాను రూ.3,650, 4కిలో వాట్స్‌కు ప్రస్తుతం రూ.8,850కు గాను రూ.4,850, 5 కిలో వాట్స్‌కు ప్రస్తుతం రూ.11,050కు గాను రూ.6,050 చెల్లిస్తే సరిపోతుంది.

అదనపు లోడ్ రాయితీ కోసం సమీప విద్యుత్ కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చు. (దరఖాస్తు ఫీజు రూ.50, కిలో వాట్‌కు డెవలప్‌మెంట్ చార్జీలు రూ.2,000, సెక్యూరిటీ డిపాజిట్ రూ.200 కలిపి చెల్లించాల్సి ఉంటుంది.)

ఉత్సాహంగా యోగా శిక్షణ తరగతులు


యోగాసనాలు వేస్తున్న గాంధీనగర్ అర్బన్ హాస్టల్ విద్యార్థులు

ఆరిలోవ: జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం కోసం విద్యా శాఖ ఆదేశాలతో సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఏఎల్‌ఎస్‌సీ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఏఎంవో లక్ష్మి, చినగదిలి సీఆర్‌పీఎస్‌లు తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు, గాంధీనగర్ అర్బన్ రెసిడెన్సియల్ హాస్టల్‌లో పిల్లలకు యోగాసనాలు నేర్పించారు. 10 నుంచి 18 ఏళ్ల వయసు గల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆసనాలు నేర్చుకున్నారు. యోగా దినోత్సవం వరకు విద్యార్థులకు యోగాసనాల్లో శిక్షణ ఇస్తామని ఏఎల్‌ఎస్‌వో తెలిపారు.